క్లుప్తంగా

విద్యార్థుల అరకొర హాజరు

కొయ్యూరు: పాఠశాలలు తెరచి రెండు రోజులు కావస్తున్నా పట్టుమని పది మంది విద్యార్థులు కూడా రావడం లేదు. మండలంలోని చాలా పాఠశాలల్లో విద్యార్థులు అంతంత మాత్రంగానే వస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు హాజరుకాలేనట్టు తెలిసింది. పాఠశాలలు తెరచిన వారం, పది రోజుల వరకు విద్యార్థులు రాకపోవడం పరిపాటిగా మారింది. గతంలో అధికారులు ఉపాధ్యాయులను ఆయా గ్రామాలకు పంపి విద్యార్థులను తీసుకువచ్చేవారు. త్వరితగతిన పాఠశాలకు వచ్చే వారికి ప్రోత్సాహక నగదును ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో విద్యార్థులు ఆలస్యంగా వస్తున్నారు.

స్వచ్ఛందంగా ఆక్రమణల తొలగింపు



తొలగిస్తున్న ఆక్రమణలు

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెంలో రహదారి విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగిస్తున్నారు. సింగవరం నుంచి కొయ్యూరు వరకు 177 మంది వరకు రహదారులను ఆక్రమించినట్టు నిర్ధారణ కావడంతో వారంతా స్వచ్ఛందంగా తొలగిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించారు. కొందరు రేకుల షెడ్లు, భవనాలు నిర్మాణం చేయడంతో వారు కూడా తొలగిస్తున్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



జడ్డంగి పాఠశాలలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రజాప్రతినిధుల చేతులమీదుగా పాఠ్యపుస్తకాల పంపిణీ జరిగింది. హెచ్ఎం దైవకృపా వరప్రసన్న కుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ కొంగర మురళీ కృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, సొసైటీ మాజీ అధ్యక్షుడు గణజాల తాతారావు, స్కూల్ కమిటీ చైర్మన్ అడపా మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు. పిల్లలు బాగా చదువుకొని పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలని ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ కుమారి, సర్పంచ్ కాసులమ్మ తదితరులు

గూడెంకొత్తవీధి: మండలంలోని వంచుల పంచాయతీ ఎల్లవరం కట్టువీధి నుంచి అరగడపల్లి వరకు నిర్మించనున్న రోడ్డుకు శుక్రవారం ఎంపీపీ బోయిన కుమారి, సర్పంచ్ కాసులమ్మ శంకుస్థాపన చేశారు. పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా రూ.1.53కోట్లతో రహదారిని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నాయకులు రఘునాథ్, చిలకమ్మ, కొండబాబు, గంగరాజు, సత్తిబాబు, శ్రీను, జోగిరాజు, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో లవరాజు

అరకులోయటౌన్: మండలంలోని ఉపాధి పనులు చేస్తున్న కూలీలు రోజు రూ.307 కూలీ డబ్బులు వచ్చేలా పనిచేయాలని అరకులోయ ఎంపీడీవో అడపా లవరాజు అన్నారు. మండలంలోని పెదలబుడు పంచాయతీ లిట్టిగుడ గ్రామంలో ఉపాధి కూలీల మస్టర్‌లు, పంట కాలువ పనులను ఆయన పరిశీలించారు. ప్రతీ ఒక్కరూ ఉదయం పూట పనికి వచ్చి పనులు చేయాలని, ఎండదెబ్బ తగలకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పాఠశాలలో కేవలం నలుగురు విద్యార్థుల హాజరు ఉండడాన్ని గమనించి హెచ్ఎంకు ప్రశ్నించారు. అంగన్వాడీ కేంద్రంలో రికార్డులు, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో జగదీశ్వరరావు తదితరులున్నారు.



మాడగడ గెడ్డ వద్ద వర్మీకంపోస్టు యార్డు



కాశీపట్నంలో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిన వర్మీ కంపోస్టు యార్డు

అలంకారప్రాయం

- గ్రామాల్లో కొరవడిన పారిశుధ్యం
- నిరుపయోగంగా చెత్త నుంచి సంపద కేంద్రాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

అరకులోయటౌన్: స్వచ్ఛగ్రామాలే లక్ష్యంగా ఆరోగ్యాన్ని పరిరక్షించి పంచాయతీ ఆదాయాన్ని పెంచేందుకు చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆశించిన స్థాయిలో ప్రగతి కనబడడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాలను స్వచ్ఛంగా ఉంచేందుకు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినా ఎక్కడా శుభ్రత కనిపించడం లేదు. రోజుల తరబడి చెత్త తొలగించకపోవడంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దుర్గంధంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దోమల వృద్ధి చెందడంతో స్థానికులు సతమతమవుతున్నారు. కంటి మీదు కునుకు ఉండడం లేదని వాపోతున్నారు. విషజ్వరాలు, మలేరియా తదితర జ్వరాలు ప్రబలుతున్నాయి. రోగాలు ప్రబలుతుండడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన చెత్త నుంచి సంపద కేంద్రాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల ఆయా కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. కేంద్రాల నుంచి ఎరువుల ఉత్పత్తి వంటివి జరగడం లేదని ఆరోపణలున్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం కొరవడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో కేంద్రాల పరిస్థితి

- అరకులోయ మండలంలో మొత్తం 14 కేంద్రాలు మంజూరైతే కేవలం నాలుగు పూర్తి చేశారు. పెదలబుడు పంచాయతీ అరకులోయ పట్టణంలోని రైల్వే గేటు వద్ద ఉన్న సంపద కేంద్రం మాత్రమే వినియోగంలో ఉంది.
- ముచంగిపుట్టు మండలంలో 22 మంజూరు కాగా నాలుగు పూర్తయ్యాయి. ఎనిమిది కేంద్రాలు 90 శాతం పనులు పూర్తయింది. మిగిలిన పది నిర్మాణ దశలో ఉన్నాయి.

నియోజకవర్గంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు : 106
నిర్మాణాలు పూర్తయినవి : 41
వినియోగంలోకి ఉన్న కేంద్రాలు : 20

- డుంబ్రిగుడ మండలంలో 18 గ్రామ పంచాయతీలకు 10 కేంద్రాలు మంజూరయ్యాయి. వీటిలో నాలుగు కేంద్రాలు పూర్తయ్యాయి, మరో 8 కేంద్రాలు మంజూరు కావాల్సి ఉంది.
- పెదబయలు మండలంలోని 23 పంచాయతీల్లో 10 కేంద్రాలు మంజూరు కాగా 10 కేంద్రాలు నిర్మించారు. ఇందులో రెండు కేంద్రాల్లో తయారీ జరుగుతుంది. మరో 10 కేంద్రాలు నిర్మాణ దశలో ఉన్నాయి. 3 కేంద్రాలు మంజూరు కావలసి ఉంది.
- అనంతగిరి మండలంలో 19 కేంద్రాలు మంజూరు కాగా 17 కేంద్రాలు పూర్తి చేశారు. 17 కేంద్రాలలో సంపద సృష్టి జరుగుతుంది. మిగిలిన 2 కేంద్రాలు నిర్మాణదశలో ఉన్నాయి.
- హుకుంపేట మండలంలో మొత్తం 31 కేంద్రాలకు 2 కేంద్రాలు పూర్తి చేశారు.
- జనాభా ప్రాతిపదికన స్వచ్ఛభారత్ నిధుల నుంచి ఒక్కో యూనిట్‌కు రూ. 4 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు నిధులు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టారు. మండలాల్లో ఒకటి, రెండు చోట్ల మినహా ఎక్కడా ఈ స్కీం పనిచేసిన దాఖలాలు లేవు.

కేంద్రాల ముఖ్య ఉద్దేశం

గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తతో పాటు వీధుల్లోని చెత్తను సేకరించి రిక్షాల ద్వారా సంపద కేంద్రాలకు తరలించాలి. ఈ మేరకు ప్రతి ఇంటికి ప్లాస్టిక్ డస్ట్ బిన్‌లు ఇంటింటికీ పంపిణీ చేశారు. కేంద్రాల్లో కేటాయించిన తడి, పొడి చెత్త కుండీల్లో సేకరించిన చెత్తను నిల్వ చేయాలి. నిల్వ చేసిన వాటిలో వర్మీ కంపోస్టు, సేంద్రియ ఎరువులు తయారు చేసి, రైతులకు తక్కువ ధరలకు విక్రయించాలి. గ్రామాల్లో ప్లాస్టిక్, స్క్రాప్, వ్యర్థ పదార్థాలను దుకాణాలకు విక్రయించి పంచాయతీల అదనపు ఆదాయాలను పెంచాలన్నదే సంపద సృష్టించే కేంద్రాల ముఖ్య ఉద్దేశ్యం. కాని ప్రస్తుతం కేంద్రాల్లో ఆ దిశగా పనులు జరగడం లేదని తెలుస్తుంది.

ఎరువులు తయారీ చేయాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు నిర్మించింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిలో వర్మీ కంపోస్టు, సేంద్రియ ఎరువుల తయారీ జరగడం లేదు. మండల కేంద్రాల్లో మినహా పంచాయతీ స్థాయిలో ఎక్కడా చెత్త సేకరించిన దాఖలాలు లేవు. గ్రామాల్లో చెత్త సేకరించి, సంపద సృష్టించాలి. లేకుంటే ఈ కేంద్రాల వల్ల ప్రయోజనం లేదు.

– శెట్టి కొండప్ప, గిరిరైతు, బోసుబెడ, మాడగడ పంచాయతీ, అరకులోయ

ప్రతిపాదనలు పంపాం



విద్యుత్, నీటి సమస్య వల్ల కేంద్రాల్లో వర్మి కంపోస్టు తయారు కావడం లేదు. కేవలం అరకులోయ పట్టణంలోని సంపద తయారీ కేంద్రంలోనే వర్మి కంపోస్టు, సేంద్రియ ఎరువుల తయారీ జరుగుతుంది. మిగిలిన కేంద్రాల్లో విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వ అనుమతితో పాటు నిధుల విడుదల చేస్తే విద్యుత్, నీటి సౌకర్యం కల్పించి అందుబాటులోకి తెస్తాం.

– కె.వి.ఎ.సత్యనారాయణ, ఈఓపీఆర్డీ, అరకులోయ

యోగా తరగతులకు విధిగా హాజరుకావాలి



సూచనలిస్తునన్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

రాజవొమ్మంగి: మండలంలోని ప్రతి సచివాలయం పరిధిలో శనివారం జరుగుతున్న యోగా శిక్షణ తరగతులకు ప్రతి ఒక్కరు హాజరు కావాలని ఎండీపీవో యాదగిరీశ్వరరావు కోరారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి సచివాలయంలో గల పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం, హెల్త్ సెంటర్ మొదలైన 9 ప్రాంతాల్లో యోగాశిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు జరిగే ఈ శిక్షణా తరగతులకు ఉపాధి వేతనదారులు, వెలుగు మహిళలు, అంగన్‌వాడీ, ఎంపీడీవో కార్యాలయాలకు చెందిన సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరయ్యేలా చూడాలని ఆయన పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఒక్కో శిక్షణ కేంద్రానికి కనీసం 50 మంది హాజరయ్యేలా చూసే బాధ్యత మన అందరిదన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా నర్సింహమూర్తి

కొయ్యూరు: స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా నర్సింహమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తుమ్మలవలస నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంత వరకు ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా మోహన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.

గిరిజన హక్కులపై విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న ఎంపీడీవో కుమార్, అధికారులు

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని వివిధ శాఖల అధికారులతో ఎంపీడీవో ఎ.వి.వి.కుమార్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. పీఎం జన్‌మన్ పథకం కింద గిరిజనుల అభివృద్ధి కోసం సమగ్ర కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు గిరిజన గ్రామాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కుమార్ గ్రామ సభలకు సంబంధించి అధికారులను నియమించారు. ఆరోగ్య భద్రత, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు, వసతి గృహాలు, సర్వశిక్ష అభియాన్, ఉపాధి అవకాశాలు, ఉపాధి హామీ జాబ్ కార్డులు, స్కిల్ ట్రైనింగ్, పీఎం జగన్‌మన్ ఖాతాలు, తదితర పథకాలపై ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దల భాగస్వామ్యంతో గ్రామ సభలు నిర్వహించి, వీడియోలు, ఆడియోల ద్వారా గిరిజనులకు చైతన్య పర్చాలని సూచించారు. గిరిజన హక్కులు అందే లక్ష్యంగా పనిచేయాలన్నారు. మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు



జడ్డంగి రైతు సేవా కేంద్రంలో వరి విత్తనాలను భద్రపరుస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి: తొలివిడతగా మండలంలోని జడ్డంగి రైతు సేవా కేంద్రానికి 240 క్వింటాళ్ల వరి విత్తనాలు వచ్చాయని మండల వ్యవసాయ అధికారి చక్రధర్ శుక్రవారం తెలిపారు. వీటికి మొలక శాతం పరీక్షించిన తరువాత 90 శాతం రాయితీపై గిరిజన రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు సరఫరా అయిన వరి వంగడాల్లో ఎంటీయూ–1121, 1064, 1318, ఆర్‌జీఎస్ 2537, బీపీటీ–5205, నెల్లూరి సన్నాలు ఉన్నట్టు తెలిపారు. మండలంలోని మిగిలిన రైతు సేవా కేంద్రాల్లో కూడా త్వరలోనే వరి విత్తనాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

వసతి గృహాల్లో దోమల మందు పిచికారీ



లోతుగెడ్డ ఆశ్రమ పాఠశాలలో దోమలమందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

చింతపల్లి: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మలేరియా నివారణకు ముందుగానే దోమలు మందు పిచికారి కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శివకుమార్ అన్నారు. లోతుగెడ్డ బాలుర ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న పిచికారీని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో మలేరియా ఉన్నటువంటి గ్రామాలను గుర్తించి పిచికారీ చేపడుతున్నామన్నారు. అదే విదంగా ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు ఎటువంటి మలేరియా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో ఈ దోమల మందు పిచికారీ చేపడుతున్నామన్నారు. విద్యార్థులకు ముందుగానే వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సబ్ యూనిట్ అధికారి బుక్కా చిట్టిబాబు, ఎంటీఎస్ యుగంధర్, హెచ్ఎం ఎస్.వి.రమణ తదతరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో క్షయవ్యాధి పరీక్షలు



గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాడేరు రూరల్: మండలంలో సలుగు పంచాయతీ ఈదులపాలెం ఆరోగ్య ఉప కేంద్రం వద్ద శుక్రవారం టీబీ ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని తుమలపాలెం, అర్జపురం గ్రామాల్లో గిరిజనులకు అవసరమైన టీబీ, క్షయ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఫీల్డ్ కో–ఆర్డినేటర్ ధనరాజ్ మాట్లాడుతు వివిధ రకాల వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్యం పొందాలన్నారు. మద్యపానం, ధూమపానంకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో రెండు వారాలకు మించి దగ్గు, జలుబు వివిధ లక్షణలున్నవారు తప్పక వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న టీబీ ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెల్త్ సూపర్‌వైజర్ సదానందం, ఎంఎల్‌హెచ్‌వో దేవి, ఏఎన్ఎం ఈశ్వరమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

41 మందికి వైద్య పరీక్షలు



మాలగుమ్మలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత ముఖ్యంగా పాటించాలని కిలగాడ ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ మాలగుమ్మి గ్రామంలో కిలగాడ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు.41 మందికి వైద్య సేవలు అందించారు. మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో పరిసరాల పరిశుభ్రత అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న మురుగు నీరు తొలగించారు.ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, వేడినీటినే తాగాలని, నిల్వ ఉన్న ఆహరం తీసుకోవద్దని, ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్న వైద్యులు, వైద్య సిబ్బందిని సంప్రదించాలని ఆయన కోరారు. కిలగాడ వైద్య సిబ్బంది సత్తిబాబు, వెంకటేశ్వరమ్మ, బుల్లమ్మ పాల్గొన్నారు.

పిల్లలను రోజు పాఠశాలకు పంపాలి



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

గంగవరం: తల్లిదండ్రులు తమ పిల్లలను రోజు పాఠశాలకు పంపించాలని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అన్నారు. మర్రిపాలెం ఎంపీపీ పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మంచి విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.అనంతరం విద్యార్థులకు విద్యా మిత్ర కిట్లు పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం భవాని, విద్యా కమిటీ సభ్యులు వెంకటరెడ్డి, అర్జున్ పాల్గొన్నారు.

సాగునీటి సమస్యపై ఫిర్యాదు



గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న రంపుల గ్రామస్తులు

గూడెంకొత్తవీధి: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పంట కాలువలు మూసుకుపోవడం వలన పొలాలకు నీరు వెళ్లే పరిస్థితి లేదని రంపుల గ్రామస్తులు శుక్రవారం పాడేరులో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. పంట కాలువలు మట్టితో నిండిపోయాయన్నారు. రెండేళ్లుగా పంట కాలువ నుంచి నీరందకపోవడంతో పంటలు పండించే అవకాశం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని పంట కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించాలని కోరారు. గ్రామంలో డ్రైనేజీ నిర్మించాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కోరారు.శిథిలమైన జీసీసీ డీఆర్ డిపో భవనం స్థానంలో కొత్త దానిని నిర్మించాలని కోరారు. గ్రామస్తులు పోతురాజు, రాజేష్, వీరభద్రరావు, గోపాలకృష్ణ, పూజారి మండ, పడాల్, సీతమ్మ, వీరన్నపడాల్, సన్యాసిరావు, బాలయ్యపడాల్, రామారావు తదితరులున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న గ్రామస్తుడు

అడ్డతీగల: రక్తదానం ప్రాణదానంతో సమానం అని అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ పండా సతీష్ అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో విశాఖపట్నం మెడికవర్ ఆస్పత్రి సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలువురు స్థానికులు రక్తదానం చేశారన్నారు. 60 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించినట్టు తెలిపారు. రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలు, క్యాన్సర్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ఆస్పత్రి కౌన్సిలర్ నారె వాసు వివరించారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రి, మెడికవర్ ఆస్పత్రి సిబ్బంది సేవలు అందించారు.

నిబంధనల మేరకు కూల్చాలి

రంపచోడవరం: నిబంధనల ప్రకారం నిర్ణయించిన ప్రకారం అక్రమ కట్టడాలు కూల్చాలని ఆదివాసీ సంఘం కూటమి నాయకులు, ఆదివాసీ చైతన్య వేదిక అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు తీగల బాబురావులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన అందజేశారు. అన్ని మండలాల్లో రోడ్డుకు ఇరువైపులా నిబంధనలు ప్రకారం 50 అడుగుల కొలత ప్రకారం తొలగించాలన్నారు. ఎవరికి ఎటువంటి మినహాయింపులు ఇస్తే ఒప్పుకొనేది లేదన్నారు.రంపచోడవరం డివిజన్‌లో అక్రమ కట్టడాల తొలగింపు నత్తనడకన సాగుతుందన్నారు. ఆదివాసీ ప్రజాప్రతినిధులు గిరిజనేతరులకు మద్దతు నిలుస్తూ ఏజెన్సీ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఆరోపించారు. అక్రమ కట్టడాలు కూల్చివేతలో కొంత మేర మినహాయింపు ఇవ్వాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌పై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు.

విద్యాభివృద్ధికి కృషి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అధికారి స్వామినాయుడు

గూడెంకొత్తవీధి: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అదనపు ప్రణాళికాధికారి (ఏపీసీ) స్వామినాయుడు కోరారు. మండలంలోని పలు పాఠశాలలను ఆయన శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు అందజేయనున్న కిట్లను పరిశీలించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు.యూనిఫాంను వెంటనే పంపిణీ చేయాలన్నారు. కేజీబీవీలో నిర్మాణంలో ఉన్న రెండో అంతస్తును పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సీఎంవో ప్రకాశ్, ఎంఈవో రామన్న, సీఆర్‌పీ దేవేంద్ర కుమార్ తదితరులున్నారు.

ఘనంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు



ఊరేగింపులో భక్తులు

గొలుగొండ: ఏఎల్‌పురం గ్రామ ఇలవేల్పు అప్పికొండమ్మ అమ్మవారి ఘటాల ఊరేగింపు గురువారం రాత్రి ఘనంగా జరిగింది. అమ్మవారికి పూజలు అనంతరం 300 మంది వరకు మహిళలు ఘటాలు, జ్యోతులు వెలిగించి ఏఎల్‌పురం నుంచి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ లోజల సుజాతతో పాటు మహిళలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. భారీగా బాణసంచా కాల్చారు. విద్యుత్ దీపాల అలంకరణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వైభవంగా రాజలింగేశ్వరస్వామి కల్యాణం

కోటవురట్ల: రాజుపేటలో రాజరాజేశ్వరి సమేత రాజలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామి కల్యాణాన్ని కమనీయంగా వీక్షించారు. వీరికి ఇబ్బంది కలగకుండా కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కనులపండువగా దుర్గాలమ్మ తల్లి పండగ

మునగపాక: మండలంలోని పాటిపల్లిలో దుర్గాలమ్మ తల్లి పండగ గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారిని రాత్రి పలువురు భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు, సరిసా శ్రీనివాసరావు, సన్నిబాబు, సంజయ్ తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అదేరోజు రాత్రి గ్రామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.